# దాంపత్య దృశ్యాలు

"నావ నడచిపోయె నట్టేటి జాలులో,—
కలిమియు చెలిమియు తొలగిపోయెను కలసి,—
వలపు నన్నెటికో వదలదు, వదలదు!—"

## మున్నీరు

సముద్రుని గంభీరస్వరాల్ని శృతిగా చేసుకుని, నిండుగుండెతో పండువెన్నెల్లో పాడిపాడి, పడుకున్నాడాయాసంతో. ముఖంమీద కన్నీళ్లు నక్షత్రాల్లాగ మెరుస్తున్నాయి వెన్నెల వెలుగుకి.

అతను సౌందర్యపిపాసి. ఏ ప్రేమమూర్తుల నారాధించాడో గాని, లలితకళలన్నీ అతనిలోనే మూర్తీభవించాయి.

నావల్లో, వెన్నెల్లో, సౌందర్యవతులతో సంచరిస్తూ,—కంఠం మెలికల్తో మాధుర్యాల్ని ఒలికిస్తూ,—నిండు ప్రాణాలతో సుందర శిలా విగ్రహంలాగ వెలిగేవాడతను.

ప్రకృతిమయి రమణీయశోభల్ని, నగ్నసౌందర్యాల్ని, రంగుల్లో చిత్రించి,—వాటిలో యవ్వనాన్ని పొదిపిపెట్టినాడతను.

♦ ♦ ♦ ♦

ఆ సుందర స్వప్నంలో విషాదచ్ఛాయలు గోచరించాయి!

ఆ ప్రణయసౌందర్యరసపూర్ణస్వర్ణపాత్ర విషసముద్రంలో విసరి వేయబడింది! హా విధీ! కఠిన విధీ!

> ప్రేమతో, స్నేహంతో, సానుభూతితో స్త్రీ పురుషులు సంచరిస్తే,— సంసారం సాగరం కాదు!— పన్నీటికాల్వ అవుతుంది. సంఘం సౌందర్య సౌరభ్యాల్తో వెలుగుతుంది. ఒకరు దక్షిణ ధృవంలోనూ, ఇంకోరు ఉత్తర ధృవంలోనూ వుంటే— ఆ యిల్లు చీకట్లో, చినుకులో, కుళ్లులో కుమిలిపోవలసిందే!
>
> —అరుంధతి—

చాల చిన్నవయస్సులోనే అతనికి పెళ్లయింది. అతనికి జ్ఞాపకంకూడ లేదేమో! ఆమె—అతని భార్య—సౌందర్యవతీ కాదు! సంస్కారంగలదీ కాదు! అయినా ఆమె తన సహధర్మచారిణి గనుక, ఆమెను సంతోషపెట్టడం తన విధ్యుక్తధర్మమని తలచాడు. తనామెను నిరాకరిస్తే ఆమెకు వేరే గతిలేదని గుర్తించాడు. ఆమెకు ఉత్సాహాన్ని కలుగచెయ్యాలని అతనెంత ప్రయత్నంచేసినా లాభంలేకపోయింది. నవ్వులు ఆమె పెదవులమీద ఎన్నడూ నాట్యం చెయ్యలేదు! సంగీత సాహిత్యసభలకు పోయి ఏ రాత్రికో ఇంటికి వచ్చేవాడతను. పస్తుతో ఏడుస్తూ పడుకున్నేది ఆ 'పతివ్రత'!

అతను సభలకు స్వస్తిచెప్పి ఇంట్లోనే పాడుకుంటూండేవాడు. అతను రచించిన నగ్నచిత్రాల్ని, ప్రేమగీతాల్ని అసహ్యించుకునేది, ఆమె!

కొన్నాళ్లకు వాళ్లింట్లో బాలచంద్రుడుదయించాడు.

ఆ నూతనోత్సాహంలో అతనెన్నో మధురగీతాలను రచించాడు; సుందరదృశ్యాల్ని చిత్రించాడు!

ఒకనాడతని సహాధ్యాయి అనూరాధ వాళ్ళింటికి వచ్చింది. ఆమె సౌందర్యవతి—కవయిత్రికూడ.

అతనింటలేడు ఆ సమయాన. అతనిభార్య ఆ నూతన స్త్రీతో పలకరించకుండ, పెరట్లోకి పారిపోయింది ధుమధుమలాడుతూ!

'శశి' వచ్చి అనూరాధని మేడమీదికి తీసుకుపోయాడు. వాళ్లిద్దరూ ఆ నగ్నసౌందర్యాల్ని ఆఘ్రాణిస్తూ, ఆనందిస్తూంటే, ఆయన వచ్చాడు.

'ఎప్పుడొచ్చావు అనూ! ఈయన మా శశి' అంటూంటే ఆమె శశి ముఖంమీద నవ్వుల పువ్వుల్ని వర్షించింది.

'శశీ! అమ్మను పిల్చుకొని రా' అన్నాడతను.

పరుగు పరుగున పోయి వచ్చి 'అమ్మెప్పుడూ ఏడుస్తోంది! తలనొప్పట!' అన్నాడు.

పాపం! తల కొట్టినట్టయిందతనికి. 'అనూ' వచ్చిందన్న ఉత్సాహంలో తన నూతన రచనలను ఆమెకు వినిపించాడు.

'శశి' 'అనూ' ఒళ్లో నిద్రపొయ్యాడు. సన్నని వెన్నెలలు ఆ చిన్ని పెదవులమీద నాట్యాలు చేశాయి.

♦ ♦ ♦ ♦

అతను 'అనూ'తో కలిసి నటించిన చిత్రం ఆ మర్నాడు విడుదలయ్యింది ఆ ఊళ్లో!

భార్యను రమ్మన్నాడు సినీమాకి అతను. 'ఆమె వుందిగా, నేనెందుకు? శశీ నేనూ వుంటాం. మీరిద్దరూ వెళ్లిరండి' అంది.

సున్నితమైన అతని హృదయం కోపంతో కంపించింది.

పట్టుపట్టి కార్లో కూర్చోపెట్టి ఆమెను చిత్రానికి తీసుకుపొయ్యాడతను, శశి అనూరాధలతో.

అతను అనూతో కలిసి నాట్యంచేసిన దృశ్యాన్నిచూసి మూర్ఛపోయింది కుర్చీలో! అందరూ లేచారు. దీపాలు వెలిగాయి. కంగారుతో కృంగిపోయిందతని కవిహృదయం.

'ఛీ! నా సుందర సంగీతంలో అపస్వర తంత్రుల్ని మీటేందుకే జన్మించావ్!' అని నిస్పృహతో ఇంటికి చేరుకున్నాడు.

ప్రణయగీతాల్ని పాడే అతని నేత్రాలు నిరాశారోదనలు చేస్తున్నాయి యిప్పుడు!

రాత్రుళ్లు సముద్రంఒడ్డున ఏకాంతంగా పాడుతూంటాడు,

"వలపు నన్నేటికో.........!"అని...

## కన్నీరు

ఆమె ఉన్నతవిద్యల్నభ్యసించింది. 'సంస్కారం' లేనివాడు ఆమెను పరిణయమాడాడు.

సాయంత్రాలు స్నానంచేసి పువ్వుల్ని పెట్టుకున్నా, పాటలుపాడుకున్నా మండిపోతూంటాడతను.

పువ్వుల్నీ నవ్వుల్నీ ప్రేమించిన ఆమె జీవితం 'ఎడారి'లా అయిపోయింది. తాను ప్రేమతో వేసుకున్న తోటలోని పువ్వుల్నమ్మేసి కూరలు కొనేవాడు ఆ తిండిపోతు! పత్రికల్నేవీ చదవనిచ్చేవాడు కాడు—స్త్రీలకి స్వేచ్ఛకావాలని వాదిస్తాయట!

తెల్లనిచీర ధరించి, తల్లో మల్లెపూలను పెట్టుకుని, చకోరాన్ని చూస్తూ, వెన్నెల్లో ఆమె

"వలపు వెఱ్ఱిదేమొ పండువెన్నెల గోరు!"

అని పాడుకుంటూంటే రుసరుసలాడుతూ ఆయన వచ్చాడు.

'వలపు! వలపు!' వలపేమిటే? ఇల్లాలివై అలాంటిపాటలు పాడ్తావుటే!...అన్ని మల్లెపువ్వులెందుకు పెట్టుకున్నావు తల్లో? దూబరా! అని అరచాడు.

ఆ రాత్రంతా ఆమె కన్నీరుకారుస్తూ పడుక్కుంది. తల్లో పువ్వులన్నీ తడిసిపోయాయి.

ప్రణయగీతాల్ని పాడే ఆమె నేత్రాలిప్పుడు నిరాశారోదనలు చేస్తున్నాయి!

## పన్నీరు

ప్రభాతగానం చేస్తున్న పక్షుల్నీ, అరుణ కిరణకాంతుల్నీ చూసేందుకై అతను స్నానంచేసి బయల్దేరేవాడు.

పాటలను పాడుకుంటూ, పువ్వుల్ని కోసుకుంటూ కిందికి వస్తూండేది ఆమె. వారిద్దరూ ఒకే కాలేజీలో విద్య నభ్యసించేవారు. వివాహమయింది వారిద్దరికీ. ఆ స్నేహం యీ స్నేహం కలిసిప్రణయంగా పరిణమించింది.

అతనుహైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడుగా నియమింపబడ్డాడు. ఆమె స్వయంగా మాసపత్రికను నడుపుతూవుంది.

దినానికి కొన్నిగంటలసేపు వారు సాహిత్యచర్చల్లో పాల్గొంటూ వుంటారు.

అతని పద్యాల్ని పాడుతూ, రూపికల్ని చిత్రిస్తూంటుంది ఆమె.

వారు పూల నావలో పాడుకుంటూ—సాహిత్యసముద్రంలో ప్రయాణంచేస్తున్నారు.

ప్రేమతో, స్నేహంతో, సానుభూతితో స్త్రీ పురుషులు సంచరిస్తే,—సంసారం సాగరంకాదు!—పన్నీటికాల్వ అవుతుంది. సంఘం సౌందర్య సౌరభ్యాల్తో వెలుగుతుంది.